క్లుప్తంగా

మాతా శిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి



దొడ్డిపల్లె ఆరోగ్య ఉపకేంద్రం వద్ద సిబ్బందితో జిల్లా నోడల్ అధికారి రియాజ్‌బేగ్

కలకడ : మాతా శిశు సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా నోడల్ అధికారి షేక్ రియాజ్‌బేగ్ అన్నారు. గురువారం ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధి కె.దొడ్డిపల్లె సచివాలయంలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. మాతా శిశువుల ఆన్‌లైన్ నమోదు పరిశీలించి, వారికి అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా స్టాటికల్ అధికారి ఓబుల్ రెడ్డి, ఏఎస్‌ఓ రాజేష్, ఎన్‌హెచ్‌ఎం మునీశ్వర్, డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ జవహర్ బాబు, ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, సిబ్బంది వెంకటేశ్వరరావు, సుబ్బరత్నమ్మ, ఇస్మాయిల్, వరలక్ష్మి, లక్ష్మీదేవి, గోపిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక



అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ : జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు స్థానిక శ్రీవేద పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. తిరుపతిలో ఈ నెల 27న జరిగిన నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ కమ్ సెలక్షన్స్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి ప్రశాంత్ అండర్-14 కేటగిరీలో 60 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే షాట్‌పుట్‌లో ప్రథమ, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం దక్కించుకున్నాడు. అండర్-16 కేటగిరీలో 9వ తరగతి విద్యార్థి అబ్దుల్ మనన్ 600 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. వీరు గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని కాలేజీ ప్రిన్సిపాల్ ఉపేంద్రరెడ్డి, పీడీ మహేంద్ర తెలిపారు.

రక్తదాన శిబిరం



కురబలకోట : అంగళ్లు మిట్స్ కళాశాల వద్ద హెల్పింగ్ మైండ్స్, హరినాథరెడ్డి మిత్ర బృందం గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏడాది క్రితం మిట్స్ కళాశాల విద్యార్థి హరినాథరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని మొదటి వర్ధంతి సందర్భంగా మిత్రులు, హెల్పింగ్ మైండ్స్ సభ్యులు వంద మంది రక్తదానం చేశారు. అన్నదానం కూడా నిర్వహించారు. అబుబకర్‌సిద్దిక్, మల్లి, పవన్, భరద్వాజ్, జితేందర్, అల్తాఫ్, బాల, గోకుల్, రాజు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ఆదరించాలి



లక్కీడిప్ తీస్తున్న ప్రయాణికులు

మదనపల్లె సిటీ : ఆర్టీసీని ఆదరించాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక డిపో ఆవరణలో మదనపల్లె-బి.కొత్తకోట రూట్‌లో ప్రయాణించిన వారికి లక్కీడిప్ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల కోసం మూరుమూల ప్రాంతాలకు సైతం బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలన్నారు. మొదటి బహుమతి కె.శశి(బి.కొత్తకోట), రెండవ బహుమతి జి.వెంకటేష్(తుమ్మరకుంట), మూడవ బహుమతి హృదయరాణి(చిలకవారిపల్లె)లు దక్కించుకున్నారన్నారు. వీరు డిపోకు వచ్చి బహుమతులు అందుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి తనిఖీ



సామాజిక తనిఖీపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

కేవీపల్లె : మండలంలోని 2022-23 ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి, సామాజిక తనిఖీ సిబ్బందితో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో మండలంలో కూలీలకు రూ.4.16 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. అలాగే సామగ్రి రూపంలో రూ.1.74 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. మండలంలోని అన్ని పంచాయతీలలో క్షేత్ర స్థాయిలో పరిశీలన అనంతరం మండల కేంద్రంలో సామాజిక తనిఖీ బహిరంగ సభలో తనిఖీ నివేదిక చదివి వినిపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

- కొనసాగుతున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు ఉత్సాహంగా.. ఉల్లాసంగా కొనసాగుతున్నాయి. క్రీడాకారులు పోటాపోటీగా ఆటలు ఆడుతున్నారు. ప్రేక్షకులు అధిక సంఖ్యలో పాల్గొని, వారిని ఉత్తేజ పరిచారు.



కలకడ : కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

మదనపల్లె : మదనపల్లె క్లస్టర్‌లోని మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు మూడో రోజైన గురువారం జరిగాయి. మదనపల్లె మండలంలోని వశిష్ట పాఠశాల, శ్రీవేద, జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న పోటీల్లో మొత్తం 64 టీమ్‌లు పాల్గొన్నాయి. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ ఆటల్లో క్రీడాకారులు ప్రతిభ కనపరిచారు. కబడ్డీ పోటీల్లో కొత్తపల్లె-2 సచివాలయానికి సంబంధించిన జట్టు విజయం సాధించింది. ఈ క్రీడల్లో పాల్గొంటున్న సుమారు 100 మంది క్రీడాకారులకు కురవంక వైఎస్సార్ సీపీ సర్పంచ్ చిప్పిలి చలపతి భోజన వసతి కల్పించారు. మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలో 36 టీమ్‌లు బ్యాడ్మింటన్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ ఆటల్లో పాల్గొన్నాయి.

తంబళ్లపల్లె : మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో జరిగాయి. కన్నెమడుగు ఉన్నత పాఠశాల మైదానంలో హెచ్‌ఎం మదన్‌మోహన్, పీడీ మొగల్‌బాషా ఆధ్వర్యంలో వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.

బి.కొత్తకోట : బి.కొత్తకోటలో రెండు మైదానాల్లో క్రికెట్, ఖోఖో పోటీలను కమిషనర్ పీఆర్ మనోహర్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారుల మధ్య పోటీలు నిర్వహించారు. ఖోఖో పోటీలకు 13 జట్లు, క్రికెట్ పోటీల్లో ఐదు జట్లు పోటీపడ్డాయి. ఈ పోటీలతో బి.కొత్తకోటలో క్రీడల సందడి నెలకొంది. క్రీడాకారులకు మంచినీళ్లు, వైద్యం కోసం ఆరోగ్య సిబ్బంది, మందులను, అత్యవసరానికి అవసరమైన ఏర్పాట్లను అందుబాటులో ఉంచారు.

వాల్మీకిపురం : మండలంలోని జర్రావారిపల్లి, చింతపర్తి పంచాయతీల్లో క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ఎంపీపీ కిరణ్ కుమార్, ఎంపీడీవో షబ్బీర్ అహ్మద్, సర్పంచ్ మునిభాస్కర్, నాయకులు నీళ్లభాస్కర్, చంద్రశేఖర్, విశ్వనాథ్, రాజబాబు, ఓరుగంటి రమేష్, లక్ష్మినారాయణరెడ్డి, పారుఖ్, శీనా, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : పెద్దతిప్పసముద్రంలో ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్‌తోపాటు మండల స్థాయి అధికారులు పాల్గొని క్రీడాకారులను మరింత ఉత్తేజ పరిచారు.

కురబలకోట : కురబలకోట జెడ్పీ హైస్కూల్‌లో ఎర్రబల్లె పంచాయతీకి చెందిన వారు క్రికెట్ ఆడారు. ఈ పోటీలను ఎంపీపీ బి.దస్తగిరి, తహసీల్దారు ఎం.భీమేశ్వరరావు ప్రారంభించారు. ఎంపీడీఓ దిలీప్‌కుమార్, సర్పంచ్ ఉప్పతి నాగరత్న, ఈశ్వర్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలికిరి : కలికిరి గ్రామ పంచాయతీలోని కలికిరి-4 సచివాలయం, మర్రికుంటపల్లి, మహల్, మేడికుర్తి గ్రామ సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, ఎంపీడీఓ గంగయ్య, మండల ప్రత్యేక ఆహ్వానితుడు శివాజీ, పీడీలు ఆర్ముగం, రియాజ్, పీఈటీలు రఘు, నియాజున్నీషా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కలకడ : మండలంలోని 12 సచివాలయాలలో 35 జట్లు నమోదు చేసుకోగా గురువారం నాటికి 32 జట్లు పాల్గొని ప్రతిభ చూపాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన జట్టుకు ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రదీప్, క్రీడల నిర్వహణ ఫిజికల్ డైరెక్టర్‌లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



కలకడ: ఉత్తమ క్రీడాకారుల జట్టుకు ప్రశంసా పత్రం అందజేస్తున్న అధికారులు



తంబళ్లపల్లె: బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



కురబలకోట : క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ, తహసీల్దారు



బి.కొత్తకోట : ఖోఖో పోటీల్లో పాల్గొన్న యువకులు



మదనపల్లె : కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచిన కొత్తపల్లె-2 మహిళా జట్టు



వాల్మీకిపురం : క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జగన్‌తోనే ప్రజల అభ్యున్నతి సాధ్యం

- వై నాట్ 175కి మద్దతుగా ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర
- ఎస్సీ కమిషన్ సభ్యుడు కట్టెపోగు బసవరావు

మదనపల్లె : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటేనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధితోపాటు ప్రజల అభ్యున్నతి సాధ్యమని ఎస్సీ కమిషన్ సభ్యుడు కట్టెపోగు బసవరావు అన్నారు. వై నాట్ 175కి మద్దతుగా ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు ఆయన చేపట్టిన పాదయాత్ర గురువారం మదనపల్లెకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. స్థానిక సబ్‌కలెక్టరేట్ వద్ద కట్టెపోగు బసవరావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ కరోనా సమయంలో ప్రజలకు భరోసా కల్పించడమే కాకుండా దేశంలోనే మరే రాష్ట్రంలో లేని విధంగా వైద్యసదుపాయాలను కల్పించి ఎందరికో ప్రాణదాతగా నిలిచారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర అన్ని వర్గాల ప్రజలకు సమప్రాధాన్యత ఇస్తూ, నవరత్నాల పథకాలతో వారి జీవితాల్లో వెలుగులు తెచ్చారన్నారు. నాలుగన్నరేళ్లలో ఇంత పెద్ద ఎత్తున మేలు చేసిన ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మనసున్న మంచి నాయకుడు జగనన్నను మరోసారి ఆశీర్వదించి రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాలకు 175 సాధించేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ప్రసాద్‌బాబు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ సెల్ నాయకులు ఆనంద్, రెడ్డెప్ప, మహేష్, కల్యాణ్, మునీర్‌సాబ్, యర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



బసవరావు పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

'టమాట'కు తెగులు.. రైతుకు దిగులు

గుర్రంకొండ : టమాట పంటకు తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో మండలంలో 1750 హెక్టార్లలో టమాట తోటలు సాగు చేశారు. ఇటీవల వచ్చిన వరుస తుపానుల ప్రభావంతో ఆకుమాడు తెగులు సోకింది. దీంతో పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. రోగం సోకిన రెండు, మూడు రోజులకే నల్లగా మారిపోతున్నాయి. చెట్టు మొదలు భాగం నుంచి పై వరకు ఆకు నల్లగా మారిపోతుంది. చెట్టుకు ఉన్న కాయలు మొత్తం రాలిపోతున్నాయి. పూత, పిందె వాడిపోయి రాలిపోతున్నాయి. నివారణ మందుల భారం రైతులపై పడుతోంది. ఎకరం తోటకు మందులు పిచికారి చేయాలంటే రూ.11 వేల వరకు ఖర్చు వస్తుందని రైతులు అంటున్నారు. మారిన వాతావరణ ప్రభావంతో ఉదయం, సాయంకాలం వేళల్లో కురుస్తున్న మంచు ప్రభావంతో ఇలాంటి తెగుళ్లు మరింత తీవ్రమవుతున్నాయి. టమాటలో కొన్ని రకాల మొక్కలకు మంచును తట్టుకొనే స్వభావం లేకపోవడంతో ఇలా జరుగుతోందని రైతులు అంటున్నారు. పంట చేతికొచ్చే సమయంలో ఇలా అవుతుండటంతో రైతులు నష్టపోతున్నారు.



వాడిపోతున్న టమాట మొక్క

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

కేవీపల్లె : కుష్టు వ్యాధిగ్రస్తులను వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది గుర్తించాలని జిల్లా పారా మెడికల్ అధికారి రవికుమార్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని గర్నిమిట్ట పీహెచ్‌సీలో కుష్టువ్యాధి నిర్ధారణపై అవగాహన కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించి ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రేష్మ, సీహెచ్‌వో భాగ్యలక్ష్మీ, పీహెచ్‌ఎన్ రమాదేవి, సీనియర్ అసిస్టెంట్ గిరిధర్ రెడ్డి, నోడల్ పర్సన్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పీలేరు : స్పర్శలేని మచ్చలు కుష్టు వ్యాధి కావచ్చునని, నిర్ధారణకు సహకరించాలని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. తలపుల పంచాయతీ జాండ్లలో కుష్టు వ్యాధిపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, ఎంపీహెచ్‌ఈవో శ్రీను, ఏఎన్‌ఎం పాముమ్నిషా, డీఈవో నాగసుధ తదితరులు పాల్గొన్నారు.



కేవీపల్లె : గర్నిమిట్ట పీహెచ్‌సీ వద్ద సిబ్బందితో పారా మెడికల్ అధికారి రవికుమార్ నాయక్

మూఢ నమ్మకాలను విడనాడాలి

సిద్దవటం : ప్రతి ఒక్కరూ మూఢ నమ్మకాలను విడనాడాలని జన విజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి సమీర్ బాషా తెలిపారు. సిద్దవటం మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ శాస్త్రీయ దృక్పథంపై జనవిజ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాల బయన్న హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తప్పక సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. శాస్త్రీయత, అశాస్త్రీయత మధ్య ఉన్న వ్యత్యాసాలను తెలుసుకోవాలన్నారు. అనంతరం జనవిజ్ఞాన కోశాధికారి సమీర్‌బాషా అశాస్త్రీయమైన భావజాలం వలన భవిష్యత్తులో పొంచిఉన్న ప్రమాదాలను తెలియజేశారు. అనంతరం వారు నోటిలో నుంచి శివలింగాలు తీయడం, చేతిలో నుంచి విభూదిని తీయడం, గాలిలో మంటలను సృష్టించడం లాంటి మ్యాజిక్‌లు చేసి, విద్యార్థులను అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : సంక్షేమ సారధి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం పీలేరు పట్టణం రజకుల కాలనీ, నాయీబ్రాహ్మణ కాలనీ, చిత్తూరు రోడ్డు, తిరుపతి రోడ్డు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలు చదివి వినిపించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం కొన్ని వర్గాలకు, వారి అనుచరులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందించేదని తెలిపారు. అదే మన జగనన్న ప్రభుత్వం పార్టీలు, వర్గాలు చూడకుండా అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పథకాలు నేరుగా లబ్ధిదారునికే పారదర్శకంగా అందించి ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించిన ఘనత జగన్‌దేనని తెలిపారు. అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు, రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. నాయీబ్రాహ్మణ కాలనీ, రజకుల కాలనీల్లో సిమెంట్ రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరడంతో.. ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, దండు జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ హబీబ్‌బాషా, మహితా ఆనంద్, షఫీ, స్టాంపుల నరసింహారెడ్డి, ఉదయ్, చలపతి, విక్టరీ వెంకటరమణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నారే వెంకటరమణారెడ్డి, రమేష్‌రెడ్డి, అమరనాథరెడ్డి, చక్రధర్, కంభం భాస్కర్‌రెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వైభవంగా సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం : స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో గురువారం శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి సేవా కార్యక్రమాలు చేశారు. అనంతరం అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను విశేష అలంకరణ చేశారు. మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో సంప్రదాయ బద్ధంగా తీసుకెళ్లి ఆశీనులను చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు చేశారు. అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

'సంకల్పయాత్ర'ను విజయవంతం చేయండి

గుర్రంకొండ : గుర్రంకొండలో నిర్వహించనున్న వికసిత్ భారత్ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని జిల్లా సర్వే అధికారి జయరాజ్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం గుర్రంకొండలో కేంద్రబృందం సభ్యులు పర్యటిస్తారన్నారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని అన్నారు. తమ శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలతో సమావేశానికి రావాలన్నారు. స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్‌లో ప్రదర్శనశాల ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కేంద్ర బృందం అడిగే వివరాలు అన్ని శాఖల అధికారులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం ముందుగానే ఆయాశాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వెంకటేశులు, ఈవోపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, మండల సర్వేయర్ రెడ్డిశేఖర్, ఎంఈవో సురేంద్రబాబు, ఏపీఎం రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : మండలంలోని దిగువపాళ్యం, గంగిరెడ్డిపల్లె పంచాయతీలలో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. ఎంపీడీవో సురేంద్రనాథ్, తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచులు ఉదయ్‌కుమార్‌రెడ్డి, లలితమ్మ ఆధ్వర్యంలో సభలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వారు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు రవినాయక్, బీజేపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సర్వే అధికారి జయరాజ్

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

పీలేరు రూరల్ : మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా సాంఘిక సంక్షేమ ఉప సంచాలకుడు డి.జాకీర్ హుస్సేన్ అన్నారు. గురువారం మదనపల్లె రోడ్డు మార్గంలో సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. హాస్టల్ రికార్డులు పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 55 వసతి గృహాలు ఉన్నాయని, 598 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారని తెలిపారు. హాస్టల్‌లో మెడికల్ కిట్లు ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో జయప్రకాష్, వార్డెన్లు రమాదేవి, కుసుమ, లత, మాధవి, శంకరయ్య, రవీంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు డి.జాకీర్ హుస్సేన్

వాహనాల తనిఖీ

రాజంపేట : రాజంపేట - నెల్లూరు రహదారిలో గురువారం రవాణా, ఆర్టీసీ శాఖలు సంయుక్తంగా వాహనాలను తనిఖీ చేశారు. 50కి పైగా వాహనాలను తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహనాల నుంచి రూ.48వేలు జరిమానాల రూపంలో వసూలు చేశారు. నాలుగు వాహనాలను సీజ్ చేశారు. ఎంవీఐ బి.వినోద్‌కుమార్, ఆర్టీసీ డీఎం రమణయ్య పర్యవేక్షణలో తనిఖీలు కొనసాగాయి. అలాగే చిట్వేలి - రైల్వేకోడూరు రహదారిలో వాహనాల తనిఖీలు చేశారు. తనిఖీలలో రవాణాశాఖ, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి

రామాపురం : ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలను నిలుపుకోవాలని లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగనాథబాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని బండపల్లె టోల్ ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీలో భాగంగా ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మాట్లాడుతూ ఇటీవల కాలంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఎక్కువ ప్రమాదాలలో స్కూటరిస్టులే ప్రాణాలు వదిలిన సంఘటనలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో మండల ఎస్‌ఐ కొండారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని వైకోట గ్రామానికి చెందిన షేక్ అహ్మద్, ఆయేషా దంపతుల కుమారుడు కిడ్నీ శస్త్ర చికిత్స కోసం ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా ముక్కా సాయివికాస్ రెడ్డి రూ. 25 వేలు ఆర్థిక సహాయాన్ని గురువారం అందించారు. ఆయన మాట్లాడుతూ బాలుడు కిడ్నీ వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడని తెలుసుకొని తమ ఫౌండేషన్ ద్వారా ఈ ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ అరవ శ్రీధర్, సీనియర్ నాయకులు బత్తిన వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

పుల్లంపేట : రంగంపల్లి పంచాయతీలోని వడ్డిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వెంకటసుబ్బయ్య కుటుంబానికి పార్టీ అన్ని విధాల తమవంతు సహకారం అందిస్తుందని రైల్వేకోడూరు శాసనసభ్యులు, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన వెంకటసుబ్బయ్య కుటుంబాన్ని గురువారం పరామర్శించి, మృతుని చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేఏసీ మండల కన్వీనర్ హరినాథ్ రెడ్డి, ఎంపీటీసీ బండారు మల్లి, యానాదయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

పుల్లంపేట : అప్పయ్యరాజుపేట గ్రామ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సయ్యద్ ముస్తాక్, ఆయన కుమారుడు రిజ్వాన్‌లు గురువారం 150 మంది పేదలకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, అప్పయ్యరాజుపేట గ్రామ ప్రజలు, వలంటీర్లు పాల్గొన్నారు.